క్లుప్తంగా

అనధికారిక లేఅవుట్లకు నోటీసులు

• విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు

ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పది అనధికారిక లేఅవుట్‌లకు నోటీసులు జారీ చేసినట్లు విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాసులు అన్నారు. తన కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ నుడా వైస్ చైర్మన్ సూర్యతేజ ఆదేశాల మేరకు అనధికారిక లేఅవుట్‌లకు ఇచ్చిన విద్యుత్ కనెక్షన్లపై నోటీసులు ఇచ్చామన్నారు. 15 రోజుల గడువులోపు సరైన అనుమతి పత్రాలు చూపకుంటే కనెక్షన్లను తొలగించనున్నట్లు తెలిపారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన

కావలి : కావలి, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల పరిధిలో ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన వచ్చిందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ముసునూరుకు చెందిన వెంకటరావు బ్రహ్మంగారి దేవాలయం వద్ద బస్సులు సరిగ్గా ఆపకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే సుప్రజ అనే ఉపాధ్యాయిని కావలి నుంచి ఉదయగిరి వెళ్లే బస్సులో స్త్రీలకు కేటాయించిన సీట్లలో పురుషులు ఆక్రమిస్తున్నారని, చిన్నపవని గ్రామానికి చెందిన వరప్రసాద్, నరేష్, రమేష్‌లు తమ గ్రామానికి వచ్చే బస్సును బ్రహ్మంగారి మఠం వరకు పొడిగించాలని వంటి పలు సమస్యలు తెలుపగా, వాటిని పరిష్కరిస్తామని డీఎం వెల్లడించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

ఉదయగిరి : ఉదయగిరి పంచాయతీరాజ్ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా చేపట్టే 43 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.3.88 కోట్ల నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ తెలిపారు. ఆయన మంగళవారం ఉదయగిరి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని సీతారామపురం మండలానికి రూ.32 లక్షలు, ఉదయగిరికి రూ.29 లక్షలు, దుత్తలూరుకు రూ.37 లక్షలు, వరికుంటపాడుకు రూ.37 లక్షలు, వింజమూరుకు రూ.38 లక్షలు, కొండాపురానికి రూ.45 లక్షలు, కలిగిరికి రూ.కోటి, జలదంకి మండలానికి రూ.70 లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని తెలియజేశారు. త్వరలో పనులను ప్రారంభిస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం

కావలి : పట్టణంలోని మూడో వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సయ్యద్ షాలి (75) మంగళవారం మరణించారు. ఈ క్రమంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హౌసింగ్ పీడీ పరిశీలన



అల్లూరు : మండల పరిధిలోని బీరంగుంట, సింగపేటలోని లేఅవుట్‌లను హౌసింగ్ పీడీ వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఈఈ మాధవ్‌రావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఓటర్స్ డే'పై వ్యాసరచన పోటీలు



ఆత్మకూరు : జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డిబేట్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు జరిపించారు. 25వ తేదీన ఓటర్స్‌డే రోజున బహుమతులు అందజేయనున్నట్లు ఆర్డీఓ పావని తెలిపారు.

గ్రామాల్లో ఆధార్ క్యాంపులు

వింజమూరు(ఉదయగిరి) : మండల కేంద్రమైన వింజమూరులోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గుండెమడకలలో మంగళవారం ఆధార్ క్యాంపులు నిర్వహించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు సునీల్, స్వరూప్‌తో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎం రేపు

ఆత్మకూరురూరల్ : డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తామని డిపో మేనేజర్ కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులను 99592 25645 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

పర్యాటక విడిదికి చెదలు

మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరంలో పర్యాటకశాఖ రూ.3.77 కోట్లతో నిర్మించిన హరిత రిసార్ట్ శిథిలావస్థకు చేరుకుంది. 2016లో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించిన పర్యాటకుల విడిది ప్రదేశం కేవలం రెండేళ్లకే శిథిలమైంది. పర్యాటకులు ఇక్కడికి వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది.

• నిర్మించిన రెండేళ్లకే శిథిలావస్థకు రిసార్టు
• కనీస వసతులు కరువు

కావలి : డివిజన్ కేంద్రమైన కావలికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రతీరం తుమ్మలపెంట బీచ్. ఇక్కడికి కావలి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, ఉదయగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వస్తుంటారు. అలాగే ఇతర ప్రాంతాల్లో ఉన్న కావలి వాసులు స్వగ్రామాలకు వచ్చినప్పుడు ఆటవిడుపు కోసం తుమ్మలపెంట బీచ్‌కు రావడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో బీచ్‌లో సముద్ర స్నానాల అనంతరం దుస్తులు మార్చుకోవడానికి, మరుగుదొడ్లు, ఎండకు నీడన సేద తీరడానికి, భోజనాలు చేయడానికి తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బీచ్ రిసార్ట్‌ను నిర్మించడానికి స్థానికుల నుంచి చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది.

సముద్రపు ఇసుకతో నిర్మాణం

పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని గత టీడీపీ హయాంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే సముద్ర తీరంలో ఉండే ఉప్పుతో కూడిన ఇసుకనే నిర్మాణానికి వినియోగించడంతో మొదలైన నిధులు స్వాహా, నాసిరకమైన నిర్మాణ సామగ్రితో తాత్కాలిక భవనంలా పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు. నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కై చేసిన నాణ్యత లేని పనులు, సరైన నిర్వహణ చేపట్టక పోవడం వల్ల నిర్మించిన రెండేళ్లకే అంటే 2018 నాటికే గదులు శిథిలమై, కిటీకీలు, తలుపులు కూడా పట్టుకుంటేనే ఊడిపోయేలా మారింది. అక్కడికి వచ్చి గదులు తీసుకునే వారు లేక, కనీసం తాగడానికి నీరు కూడా దొరకని దుస్థితి నెలకొని ఉంది. సముద్ర తీరంలో సేద తీరుదామని తుమ్మలపెంట బీచ్‌కు వెళ్లిన పర్యాటకులకు అక్కడున్న శిథిల పర్యాటకశాఖ రిసార్ట్ భవనం అలసిన మనసులకు ఆవేదన మిగుల్చుతోంది.



రిసార్ట్ వెలుపల అస్తవ్యస్తంగా ఉన్న మొక్కలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

తుమ్మలపెంట బీచ్‌లో రిసార్టుల పరిస్థితిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతాం. అక్కడ నెలకొన్న సమస్యలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటాం.
– సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్, నెల్లూరు డివిజన్ పర్యాటకశాఖ



రిసార్ట్ ప్రవేశ మార్గం

మండల సమావేశం 29న

సీతారామపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29వ తేదీన ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో తాగునీరు, విద్య, వ్యవసాయం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ శాఖలపై సమీక్ష ఉంటుందని, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

వరికుంటపాడు : నెల్లూరులో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మండల సీపీఎం నేత కె.వెంకటేశ్వర్లు మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సీ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేసి సభలను విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ అదాలత్ రేపు

అల్లూరు : విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించి గురువారం అల్లూరు సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ అల్లూరు టౌన్ ఏఈ షేక్.మస్తాన్ షరీఫ్ మంగళవారం తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్ : పాడి రైతుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్ అన్నారు. మండలంలోని దేపూరు, అశ్వనీపురం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పశు సంవర్ధక శాఖ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. పశుగ్రాస ఉత్పత్తి, పెయ్యదూడల పెంపకం, వ్యాధి నిరోధక కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామీణ రైతులకు తమ శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కోవూరు డీఏలీడీఏ డాక్టర్ శ్రీనివాసరావు, ఆత్మకూరు సబ్ డివిజన్ ఏడీ డాక్టర్ జయచంద్ర, కావలి డివిజనల్ ఏడీ రసూల్, కరటంపాడు పశువైద్యాధికారి కృష్ణయ్య యాదవ్, స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ శివ, స్థానిక రైతులు పాల్గొన్నారు.

110 పశువులకు ఆరోగ్య పరీక్షలు

వరికుంటపాడు : మండలంలోని జి.కండారెడ్డిపల్లి గ్రామంలో పశువులకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పశువైద్యాధికారి రాఘవేంద్ర శర్మ తన బృందంతో 60 పశువులకు వైద్య చికిత్సలు అందించడంతో పాటు మరో 50 పశువులకు నట్టల నివారణ మందును తాపించారు. రైతులు పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.



ఆత్మకూరురూరల్ : దేపూరులో గోవుకు పూజలు చేస్తున్న జేడీ రమేష్‌నాయక్

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

కావలి : కావలి డిపో పరిధిలో ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా బహుమతుల ప్రదానం విజయవంతంగా కొనసాగుతోందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. డాక్టర్ రామస్వామి హాస్పిటల్స్ సహకారంతో కావలి బస్టాండ్‌లో మంగళవారం లక్కీ డిప్ ద్వారా ముగ్గురిని ఎంపిక చేశారు. వారిలో పెద్దపవని – లింగసముద్రం రూట్‌లో కావలి పట్టణానికి చెందిన జి.శ్రీనివాసులు, కొమ్మి – కొండాపురం రూటులో ఎర్రబల్లి గ్రామానికి చెందిన రఫీ, అల్లూరు రూటులో కావలికి చెందిన డి.వీరాంజనేయులు ఎంపికయ్యారు. వీరికి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ షమీమ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం దీనిని అల్లూరు, కొండాపురం, లింగసముద్రం రూట్లలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్పనారెడ్డి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ పాల్గొన్నారు.



తగిన జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ



చేజర్ల కూడలిలో విద్యార్థుల మానవహారం

అనుమసముద్రంపేట(ఆత్మకూరు) : వాహనాలను నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఏఎస్‌పేట ఎస్సై ఎ.సైదులు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో మంగళవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వాహన ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఠాగూర్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• **దుత్తలూరు :** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై పి.ఆదిలక్ష్మి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మోడల్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

• **సంగం :** మండల కేంద్రమైన సంగంలో ఎస్సై రాజేష్ మంగళవారం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా పోలీస్ స్టేషన్ నుంచి హైవే వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని కోరారు. ఏఎస్సై జాకీర్ బాషా, హెడ్ కానిస్టేబుల్ శిఖామణి పాల్గొన్నారు.

చేజర్ల : మండల కేంద్రంలో ఎస్సై తిరుమలరావు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు.



ఆత్మకూరు బస్టాండ్ ఆవరణలో..



సంగంలో..

• **ఆత్మకూరు :** వాహన డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సీఐ గంగాధర్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో మంగళవారం సాయంత్రం ఎస్సై జిలానీతో కలిసి వ్యాన్, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. స్రైడ్ సంస్థ నిర్వాహకుడు వాగాల శ్రీహరి, పయ్యావుల రామకృష్ణ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట బస్టాండ్ వద్ద విద్యార్థుల మానవహారం



దుత్తలూరు సెంటర్‌లో మానవహారం

ఆక్రమిత స్థలం పరిశీలన

అనుమసముద్రంపేట(ఆత్మకూరు) : వక్ఫ్‌బోర్డుకు చెందిన 8.10 ఎకరాల పొలం ఆక్రమణకు గురైందని ఆరోపణలు రావడంతో జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఖుదావన్ మంగళవారం పరిశీలించారు. వివరాల మేరకు.. ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామంలో సర్వే నంబరు 426లో వక్ఫ్‌బోర్డుకు చెందిన 8.10 ఎకరాలు భూమి ఉంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దానిని చదును చేస్తుండగా గ్రామస్తులు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఆయన రెవెన్యూ అధికారులను ఘటనా స్థలానికి పిలిపించి చర్చించారు. అది ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికారులు తెలపడంతో తాను చదును చేసేందుకు ప్రయత్నించానని ఆక్రమణకు పూనుకున్న వ్యక్తి తెలిపారు. దీనిపై మరోసారి సర్వే చేసి నిర్ధారిస్తామని రెవెన్యూ అధికారులు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు. పీర్లచావడి నిర్వాహకులు ఎండీ షకీల్, సయ్యద్ రఫీ, వలీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉదయగిరి : మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఇన్‌చార్జి సీడీపీఓ శారద మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దుత్తలూరు మండలంలోని శ్రీరామ్‌నగర్, చింతలగుంట, బొటికర్లపాడు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రాల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అధ్యాపకురాలికి పురస్కారం

అల్లూరు : మండల పరిధిలోని నార్తు మోపూరులో ఉన్న శ్రీచైతన్య జూనియర్ కళాశాల అధ్యాపకురాలు కనకవల్లికి సావిత్రీబాయి పూలే పురస్కారం వరించినట్లు కరెస్పాండెంట్ శివకుమార్ మంగళవారం తెలిపారు. గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన ఆడిటోరియంలో ఆమె అవార్డును అందుకున్నట్లు వివరించారు.



పెన్షనర్ల సమావేశం

ఆత్మకూరు : పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల ప్రభుత్వ పెన్షనర్ల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పి.శ్రీరాములు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సంఘ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు రమణయ్య, కార్యవర్గ సభ్యులు మణిప్రసాద్, రామ్మూర్తి, ఖాజామొహిద్దీన్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



పన్నులు చెల్లించాలి



ఆత్మకూరు : మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉన్న దుకాణదారులు వెంటనే పన్నులు చెల్లించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం మున్సిపల్ సిబ్బంది శ్రీను, లాలు తదితరులతో కలిసి బస్టాండ్ సెంటర్ నుంచి సత్రం సెంటర్ వరకు ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉన్న సుమారు 400 మంది దుకాణదారులకు డిమాండ్ నోట్‌లు పంపిణీ చేశారు. నోటీసులో ఉన్న మేరకు వెంటనే పన్ను చెల్లించాలని తెలిపారు.

గ్రామాల్లో సర్వే



వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో జరుగుతున్న కుష్ఠు సర్వేను పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖరరాజు మంగళవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణం



ఆత్మకూరు : గతంలో మెప్మాలో పనిచేసిన మాజీ సీసీ, టీడీపీ మహిళా కార్యకర్త పట్టణంలోని మెయిన్ బజారులో ఓ వ్యాపార గదిని యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడ చిన్నపాటి టిఫిన్ సెంటర్ ఉండగా ఆ వ్యాపారి వద్ద స్థలాన్ని ఆమె కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వ స్థలంలో అమ్మడానికి ఆయన ఎవరు, కొనడానికి ఈమె ఎవరు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణ టీడీపీ నేతల అండతో వ్యాపార గదిని ఆమె నిర్మిస్తుండడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌ను సంప్రదించగా పరిశీలించి నోటీసులు అందజేయనున్నట్లు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

ఆత్మకూరు : మధ్యవర్తిత్వం ద్వారా పలు కేసులు సులభతరంగా పరిష్కారం అవుతాయని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి గాయత్రి అన్నారు. పట్టణంలోని కోర్టు హాల్లో బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులతో మంగళవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో కక్షిదారులకు ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు.

సబ్‌జైలు పరిశీలన

పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి గాయత్రి సందర్శించారు. ఖైదీలతో మాట్లాడారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్, న్యాయవాదులు రమణయ్య, నందా ఓబులేసు, మహదేవరెడ్డి, నజీర్, జైలర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



న్యాయవాదులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి గాయత్రి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కలిగిరి : రైతులు పంటల సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజాకుమార్ తెలిపారు. వెలగపాడు రైతుసేవా కేంద్రం పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రస్తుతం సాగులో ఉన్న పచ్చిశనగలో వేరుకుళ్ల తెగులు కనిపిస్తుండటంతో నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్‌బాబు, వింజమూరు ఉద్యానాధికారి షఫీ, ఏఈఓ సునీల్‌కుమార్, వీఏఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చేపట్టాలి

దుత్తలూరు : వరిపంటలో ఆకుచుట్టు పురుగు, కాండం తొలుచు పురుగును గుర్తించామని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ ఎన్.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటంపేట, నందిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరిపంటలో పురుగుల నివారణకు సూచనలు చేశారు. హార్టికల్చర్ అధికారిణి జయశ్రీ, కమ్మవారపాళెం సొసైటీ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, ఏఈఓలు బంగారం, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడి అంచనా

వరికుంటపాడు : పంటకోత ప్రయోగం ద్వారా దిగుబడిని అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. ఆయన మండలంలోని నరసింహపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మినుము పంటకోత ప్రయోగం చేపట్టారు. అనంతరం బీమా పథకం, పంట నమోదుపై అవగాహన కల్పించారు. వీఏఏలు చంద్రశేఖర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మెళకువలు పాటించాలి

సీతారామపురం : వరినాటు వేసే సమయంలో రైతులు మెళకువలు పాటిస్తే కాండం తొలుచు పురుగును తగ్గించుకోవచ్చని మండల ఏఓ చెన్నారెడ్డి సూచించారు. ఆయన మంగళవారం నెమళ్లదిన్నె, గంగవరం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. ఆఖరి దుక్కిలో వరినాట్లకు ముందు ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్ వాడాలన్నారు. అనంతరం నెమళ్లదిన్నెలో కంది పంటను, మామిడితోటను పరిశీలించారు. ఏఈఓ సాంబశివయ్య, వీఏఏ నరేంద్ర పాల్గొన్నారు.



ఉదయగిరి : మొక్కజొన్న పంట పరిశీలన

• **ఉదయగిరి :** మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. పురుగుల నివారణకు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు తెలియజేశారు. ప్రస్తుతం ఉధృతంగా ఉన్న కత్తెర పురుగును అదుపులో ఉంచుకునేందుకు పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. వ్యవసాయాధికారులు ఆంజనేయులునాయక్, సురేఖాదేవి, లక్ష్మీమాధవి పాల్గొన్నారు.

• **మర్రిపాడు :** మండలంలోని సింగనపల్లి, కంపసముద్రం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మర్రిపాడు ఏఓ ఎస్.రామ్మోహన్ తెలిపారు. సాగులో ఉన్న వరిపంట, జొన్న, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వీఏఏలు బి.ప్రవీణ్‌సాయి, బి.శ్రావణి పాల్గొన్నారు.